# కాలమ్ దాటని కథలు

## ఆమె...నేను

"భాగవతుల"

ఆఫీసు పనిమీద విజయవాడ వెళ్ళాను. తిరుగు ప్రయాణంలో ట్రయిను గంట లేటు. కాలక్షేపానికి ఏదో పత్రిక కొని తిరగవేస్తున్నాను. రివ్వున వేసే చలిగాలికి సన్నగా వణుకు మొదలైంది. అర్ధరాత్రి వేళ....సిగరెట్ దొరుకుతుందా.... ఏమో అనుకుంటూ. పాన్ షాపు కోసం చుట్టూ చూశాను. నా ప్రక్కన బెంచీ వెనుకగా....చలికి వణుకుతూ. చాలీచాలని గుడ్డతో "అందాల్ని" కప్పుకుంటున్న అతివ. ఆమె; వర్షం వల్ల ఎటు వెళ్ళాలో తెలియక. ప్రక్కన నన్ను చూస్తూ. నేనంత తీక్షణంగా చూస్తున్నందుకు సిగ్గుపడ్తూ. చాలీచాలని వస్త్రాలు సర్దుకుంటూ... వాస్తవంలోకి వచ్చిన నేను; దిక్కుచచ్చిపోయి....ఆమె ఎలా అర్థంచేసుకుందో....అంతలోనే తేరుకున్నాను మేల్కొన్న మానవత్వంతో నా సూట్ కేస్ తెరిచి. పాత బట్టల జత యిచ్చాను-



కట్టుకొని. శరీరం "కప్పుకోమని". ఆమె బట్టలు తీసికొని "అటు" వెళ్ళింది.... ఎంతకీ తిరిగి రాకపోతే 'సభ్యత' కాకపోయినా. కుతూహలంగా 'అటు' చూశాను ఏమైందా అని. దూరంగా టీ స్టాల్ దగ్గర.. నేనిచ్చిన బట్టలు కుదువ బెట్టి. ఆత్రంగా రొట్టె కొనుక్కొని తింటూ. ఆమె ... ... నేను నివ్వెరబోయాను .. శరీరం దాచుకోమని యిచ్చిన బట్టలు. క్షుద్బాధ తీర్చాయి ....ఏ అవసరం గొప్పది? నాలో నేనే మధనపడిపోయాను....

## "గులాబీపువ్వు"

సెకెండ్ బి.ఏ. చదువుతున్న 'రీటా' ను అల్లరి చేయటానికి ఆ కాలేజీ పోజు గాళ్ళు వెనకాడతారు. ఎవరుగాని. ప్రయత్నించినా- తలనుండి కాళ్ళదాకా వర్ణించి తిట్టి. ప్రిన్సిపాల్‌కి రిపోర్టు యిస్తుంది.



ఎందుకో మరి ఆ రోజు కొంతమంది స్టూడెంట్స్ పందెం వేసుకున్నారు. రీటాతో మాట్లాడి గులాబి పువ్వు అందించినవారికి ఏభై రూపాయలు ప్రైజని. ఈ పందానికి ఎవ్వరు ధైర్యంగా నిలబడలేకపోయారు. కొంతసేపయ్యాక కొత్తగా జాయినయిన 'అప్పారావ్' ఈ పందానికి ఒప్పుకున్నాడు. ఇదే పందానికి ఆరుమాసాల క్రితం 'రఘు' అనే విద్యార్థి 'రీటా' చేత చెప్పు దెబ్బలు తిని ప్రిన్సిపాల్ చేత సస్పెండ్ చేయబడ్డాడు. అప్పారావ్ అదే పందాన్ని అంగీకరించాడంటే ఆశ్చర్యమే.

తర్వాత రోజు "రీటా" ఒంటరిగా రావడం అప్పారావ్ చూసి. రీటాను అనుసరించాడు. స్టూడెంట్స్ అంతా కొంత దూరం నుంచి ఆసక్తిగా చూస్తున్నారు. రీటాను సమీపించి అప్పారావ్ ఏదో అన్నాడు రీటా ఆగి సీరియస్‌గా చూసింది. వీడి పని గోవిందా అనుకున్నారు. అప్పారావ్ పావు గంట మాట్లాడి మొత్తానికి "గులాబీపువ్వు" ఇచ్చేశాడు. విద్యార్థులంతా విస్తుపోయారు. అప్పారావ్ ఏభై కొట్టేశాడు

అసలు విషయం చెప్పమని అప్పారావ్‌ని బలవంతంచేశారు. "అసలు విషయం చెప్తే తిరిగి యాభై తీసుకోరుగా?"

"తీసుకోము" అందరూ ఒకేసారి అన్నారు.

అప్పారావ్ చెప్పాడు: "రీటా మా అక్కే"నని!

—సంజయ్ కుమార్

## పాపం! ప్రేక్షకులు

గొప్ప మళయాళ "ఎ"సర్టిఫికేట్ చిత్రం విడుదల ఆ రోజే. ఇసక వేస్తే రాలనంత మంది జనం. టిక్కెట్లకై కొట్టుకొంటున్నారు. ఇప్పటికి ఆ సినిమా 3సార్లు రిలీజ్ అయింది. ఎప్పుడు "రిలీజ్ అయినా "బంపర్" కలెక్షన్లు.


కౌంటర్లు మూసేశారు. "హౌస్‌ఫుల్" బోర్డు పెట్టేశారు. హాలులో విపరీతమయిన "టెన్షన్" సినిమా ఎప్పుడు మొదలుపెడతారా అని." అడ్వర్‌టైజ్‌మెంట్స్" అయిపోయాయి.

"ఇండియన్ న్యూస్ రెవ్యూ" అయిపోయింది. సెన్సార్ సర్టిఫికేట్ వేశారు. 3 సార్లు రిలీజ్ అయిన పాతసినిమా! అక్షరాలు సరిగా కనిపించడంలేదు. హాలులో ఈలలు. చప్పట్లు.

టెక్నిషియన్ల పేర్లు ఒక్కొక్కటి తెర మీద పడుతూవున్నాయి. ఆఖరుగా సినిమా పేరు "అర్జున గర్వభంగం.

ఆ తరువాత-

"మేనేజిమెంట్ వారితో సహకరించండి.



సకాలంలో బాక్సులు అందని కారణంగా "అర్జున గర్వభంగం" చిత్రంను ప్రదర్శించుచున్నాము. ప్రేక్షకులు సహకరించ ప్రార్థన. అనే అక్షరాలు తెరపై పడ్డాయి.

మళయాళ సినిమా తీసిన నిర్మాత అదే నటీనటులు టెక్నిషియన్లతో "అర్జున గర్వభంగం" అనే సినిమా తీసి విపరీతంగా నష్టపోవడంతో హాలు మేనేజరు, నిర్మాత ఆడిన నాటకం ఇది.

—కొంపల్లి రఘురాం